క్లుప్తంగా

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు



బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజైన గురువారం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, శ్రావణ్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకారంలో అంకాలమ్మ

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామ సమీపాన సగిలేరు ఒడ్డున వెలసి ఉన్న మహాంకాళి (అంకాలమ్మ) అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు గురువారం ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకమైన పూలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు ఆరాధన



సింగరయ్యస్వామి గుడి

బ్రహ్మంగారిమఠం : బి.మఠం– మిట్టమానుల పల్లె రోడ్డులో ఉన్న అవధూత శ్రీ కొండా సింగరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ బీవీ రనసయ్య తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక భజనలు, పలు కార్యక్రమాలు, అన్నదానాలు ఉంటాయన్నారు. సాయంత్రం ఉత్సవం ఉంటుందని వివరించారు.

ఇఫ్తార్ విందు



ముస్లింలతో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదిత్యరెడ్డి

కలసపాడు : కలసపాడు ముస్లింలకు గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఆక్టివేట్ మెంబర్ చిత్తారాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాసదీక్షలో ఉన్న ముస్లింలతో కలిసి వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి నమాజ్ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాసదీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఉపవాసదీక్ష విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష చేయడం ముస్లిం సోదరులకు ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంకనగురివిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుదర్శన్, నాయకులు సూదారామకృష్ణారెడ్డి, నారాయణ యాదవ్, వైస్ ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రాంబాబు, వైస్ సర్పంచ్ వీరారెడ్డి, ఎంపీటీసీ షరీఫ్, వెంకటరామిరెడ్డి, బాలుడు, నియోజకవర్గ ఐటీ వింగ్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు చాపాటి సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకున్న విద్యార్థులు

పోరుమామిళ్ల : వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 253 మంది విద్యార్థులకు చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం దుస్తులు పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధి ప్రసాదరెడ్డి తెలిపారు. ఎఫ్‌సీయస్ వ్యవస్థాపకులు తోమాస్‌రెడ్డి, డాక్టర్ గీత దంపతులు ఈ దుస్తులు అందచేసినట్లు ఆయన చెప్పారు.

విలీన ప్రతిపాదన విరమించుకోవాలి

గోపవరం : ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను మోడల్ ప్రాథమిక పాఠశాలలకు చేసే విలీన ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని డెమోక్రటిక్ వైఎస్సార్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిశంకర్, విద్యాధర్‌లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అవసరమైన చోట మాత్రమే మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలే గానీ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను తరలించి మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయడం తగదని తెలిపారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేస్తున్న నియోజకవర్గ అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి

బద్వేలు అర్బన్ : కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త ఎస్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్షా సామగ్రిని గురువారం విశ్వనాథరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడి ప్రణాళికతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, శేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, అల్లా, సుభేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశినాయన : మండలంలోని కోడిగుడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు గురువారం ఎస్టీయూ సీనియర్ నాయకులు వాకాచంద్రశేఖర్, జ్యోతిమహేష్‌ల సహకారంతో పరీక్షా సామగ్రిని అందజేశారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, ఎస్టీయూ సీపీఎస్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మెర్సిమాలిని, యూటీఎఫ్ సభ్యులు నారాయణ, రామసుబ్బారెడ్డి, రాజగోపాల్, వెంకటరామయ్య, జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ (257) పోరుమామిళ్ల రీజియన్ ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అయ్యలూరిబ్రహ్మానందరెడ్డి, ఏపీటీఎఫ్ రీజియన్ నాయకులు బీరంరాం భూపాల్‌రెడ్డి, కలసపాడు బాధ్యులు ఎ.వెంకటసుబ్బయ్య, పత్తికిరన్‌కుమార్, ఎం.ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైదుకూరు : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఇష్టంగా పరీక్షలు రాయాలని స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో గురువారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పలుగురాళ్లపల్లె హైస్కూల్ హెడ్మాస్టర్ బండి సత్యనారాయణ, స్థానిక జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్ మాట్లాడారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొల్ల ఇక్కడ పుట్టడం జిల్లా ప్రజల అదృష్టం

- మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మొల్ల జయంతి వేడుకలు



మొల్ల చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నాయకులు

మైదుకూరు : రామాయణ కవయిత్రి మొల్ల వైఎస్ఆర్ జిల్లాలో పుట్టడం జిల్లా ప్రజల అదృష్టమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లె శివరాం అన్నారు. మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా మొల్ల చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నేట్లపల్లె శివరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నేట్లపల్లె శివరాం మాట్లాడుతూ కవయిత్రి మొల్ల సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసి అందరూ పఠనం చేసేలా చేసిన గొప్ప కవయిత్రి అని కొనియాడారు. వెనుకబడిన కుమ్మరి బీసీ కులానికి చెందిన తొలి తెలుగు మహిళ కవయిత్రిగా పేరొందారని పేర్కొన్నారు. తన విశిష్టతకు, కీర్తికి చిహ్నంగా శ్రీకృష్ణ దేవరాయాలచే సత్కరించబడటం జిల్లా వాసులకు గర్వకారణమని తెలిపారు. మొల్ల జయంతిని అధికారికంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జరుపుకోవాలని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీఓ జారీ చేశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీ మహిళల పట్ల, బీసీల పట్ల ఉన్న నిబద్ధతకు కవయిత్రి మొల్లను గుర్తించడమే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, బీసీ సెల్ నాయకులు ఓబయ్య, బత్తల సుబ్బరాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, మూలె భరత్ కుమార్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్టీఓ, డీఎం

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని బద్వేలు సబ్ ట్రెజరీ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సి.నిరంజన్‌లు పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ గ్యారేజీలో నిర్వహించిన డిపో పరిధిలో వివిధ అంశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి ఉద్యోగి పోటీతత్వంతో పనిచేసి సత్ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం శివరాత్రి స్పెషల్ సర్వీసుల నిర్వహణ, డీజిల్ ఆదా, సంస్థ ఆదాయం, వాహనాల కండీషన్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులను, డ్రైవర్లను, కండక్టర్లను, మెకానిక్‌లను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీఐ, గ్యారేజ్ ఇన్‌చార్జి, ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఆటోలకు ప్రొద్దుటూరులోనే ఎఫ్‌సీ ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు రూరల్ : ఆటోలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) ప్రొద్దుటూరులోనే జారీ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆటోలు ఎఫ్‌సీ చేయించుకోవాలంటే ప్రొద్దుటూరు ఆర్టీఓ కార్యాలయంలో చేయడం లేదన్నారు. అధికారులు కడపలో చేయించుకోవాలని చెబుతున్నారన్నారు. ప్రొద్దుటూరులో ఆర్టీఓ కార్యాలయం కోసం ఐదెకరాల స్థలం, నాలుగురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఒక ఆర్టీఓ ఉన్నప్పటికీ ఆటోల ఎఫ్‌సీ కోసం కడపకు వెళ్లాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రొద్దుటూరులో సుమారు 8వేల ఆటోలు ఉన్నాయని తెలిపారు. డీటీసీ స్పందించి ప్రొద్దుటూరులోని ఎఫ్‌సీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, ఓబయ్య, చెన్నారెడ్డి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

15లోపు దుకాణాల బకాయిలు చెల్లించాలి



ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఆధీనంలో ఉన్న వ్యాపార బంకులు, సత్రాల నిర్వాహకులు పాత బకాయిలు ఈనెల 15లోపు చెల్లించాలని మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. స్థానికంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. దేవస్థానం పరిధిలో 2021 నుంచి 2025 వరకు దాదాపు 130 వ్యాపార సముదాయాలు రూ.15 లక్షల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. దేవస్థానానికి తక్కువ బాడుగలు కూడా ఇవ్వకుంటే ఎలా అన్నారు. వ్యాపారులకు ఇప్పటికే పలుమార్లు తెలిపినా చెల్లించడం లేదన్నారు. గడువులోపు చెల్లించకపోతే ఈ నెల 25 నుంచి దుకాణాలకు తాళాలు వేస్తామన్నారు. మఠం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వ్యాపార సముదాయాలలో లక్షల రూపాయలు నిలిచిపోతే అభివృద్ధికి ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. ఇప్పటికే మఠం నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గతం కంటే ఈ 6 ఏళ్లలో మఠం అభివృద్ధి వైపు త్వరితగతిన ముందుకు సాగిందన్నారు. ప్రస్తుతం మఠం అభివృద్ధి చెందాలంటే అందరి సహకారం ఎంతగానో ఉండాలన్నారు.

గుత్త హక్కుదారులు నిబంధనలు పాటించాలి

బద్వేలు అర్బన్ : పురపాలక సంఘం పరిధిలో నిర్వహించే కూరగాయల మార్కెట్, పాట్టేళ్ళు, మేకల సంత, మాంసం, చేపల మార్కెట్ వేలంపాటలో హెచ్చుపాటపాడి హక్కులు పొందిన గుత్త హక్కుదారులు పురపాలక సంఘం నిబంధనలు, షరతులు పాటించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో కూరగాయల మార్కెట్, పొట్టేళ్ళు, మేకల సంత, మాంసం, చేపల మార్కెట్‌లకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో కూరగాయల మార్కెట్‌కు గాను నిర్వహించిన వేలంపాటలో రూ.19.03 లక్షలకు అశోక్‌రాయల్, పొట్టేళ్ళు, మేకల సంతకు గాను నిర్వహించిన వేలంపాటలో రూ.1.62 లక్షలకు ఓబుల్‌రెడ్డిలు హెచ్చుపాట పాడి సొంతం చేసుకున్నారు. మాంసం, చేపల మార్కెట్‌కు సంబంధించి ఎవరూ దరఖాస్తు చేయకపోవడంతో వేలంపాటను వాయిదా వేశారు. ఈ వేలంపాటల ద్వారా పురపాలక సంఘానికి రూ.20.65 లక్షలు ఆదాయం సమకూరినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ రఘునాథరెడ్డి, మున్సిపల్ ఆర్ఐలు ఖాజాహుస్సేన్, షఫి, సిబ్బంది ప్రమీల, మల్లికార్జున పాల్గొన్నారు.

‘విజయసాయిరెడ్డి కూటమి అద్దె మైకు’

ఖాజీపేట : మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఒక విషపురుగుగా, కూటమి తరపున అద్దె మైకు తీసుకుని మాట్లాడే వ్యక్తిగా మారిపోవడం దురదృష్టకరం అని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ కడప జోన్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. స్థానికంగా ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఆయనకు రాజకీయ భిక్ష లభించిందని అన్నారు. జగన్ ద్వారా ఎదిగి నేడు ఆయనపైనే విమర్శలు చేయడం దారుణం అన్నారు. జగన్ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నానని, రాజకీయాలకు స్వస్తి చెప్పి వ్యవసాయం చేసుకుంటానని విజయసాయిరెడ్డి చెప్పడం జరిగిందని అన్నారు. నేడు కూటమి నేతలు చెప్పినట్లుగా వారి గొంతుగా మారి విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. జగన్ కోటరీకి లొంగిపోయేంత బలహీనుడు కాదని గుర్తించుకోవాలన్నారు.

జ్యోతి క్షేత్రంలో నిర్మాణాలు కూలగొట్టడం దుర్మార్గం

పోరుమామిళ్ల : జ్యోతిలోని కాశినాయన క్షేత్రానికి సంబంధించిన నిర్మాణాలు కూలగొట్టడం అత్యంత దుర్మార్గమని, కూటమి ప్రభుత్వ వికృత చర్య అని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్, జిల్లా కమిటీ సభ్యురాలు గౌసియాబేగం విమర్శించారు. స్థానికంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ అంశంపై సీపీఎం రాష్ట్ర నాయకులు కాశినాయన క్షేత్రానికి రానున్నారన్నారు.

భూములపై విచారణ చేపట్టాలి

బి.కోడూరు : మండల పరిధిలోని పోరుమామిళ్ల – బద్వేలు ప్రధాన రహదారికి ఇరువైపులా స్థానికేతరులకు అక్రమ అసైన్ చేసిన ఫ్రీహోల్డ్ భూములపై తక్షణమే విచారణ చేపట్టి అర్హులకు పంపిణీ చేయాలని ఏపీ న్యాయ వృత్తిదారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గడ్డంరాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం తహసీల్దారుకు ఆయన వినతిపత్రం సమర్పించారు.

దివ్యాంగులకు రంజాన్ తోఫా

ప్రొద్దుటూరు : పట్టణంలో ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన త్రీటౌన్ ఎస్ఐ యోగేంద్ర 30 మంది దివ్యాంగులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ పేదలు సంతోషంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని నిత్యావసర సరుకులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ అల్తాఫ్, ఆసిఫ్, ఖాదర్, సుబ్బరాయుడు, జ్యోతి, వెంకటలక్ష్మి, గురుప్రసాద్, వెంకటసుబ్బయ్య, భద్రుడు, కేశవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి

అట్లూరు : ఈ నెల 14న కడపలో సీపీఎం ఆధ్వర్యంలో జరిగే నిరుద్యోగ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్‌బాష, మండల కార్యదర్శి ఇ.రమణయ్యలు తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్‌లు హాజరవుతారని, జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు, మేధావులు, ప్రజా సంఘ నాయకులు, అభ్యుదయవాదులు ప్రతిఒక్కరు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవిచంద్ర, గోపయ్య, ఎ.గోపయ్య, లత, విజయమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

చాపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆప్తమాలిక్ ఆఫీసర్ రఘురామిరెడ్డి 30 మంది విద్యార్థులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. గ్లకోమా వారోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ఎస్ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరులో గ్లకోమా వారోత్సవాలు

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ గేటు వేలం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలో బస్టాండ్ గేటు, కూరగాయల దిన మార్కెట్ రుసుం వసూలు హక్కు కోసం గురువారం నిర్వహించిన వేలంలో బస్టాండ్ గేటు రూ.17.86 లక్షలకు పలికింది. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, మేనేజర్ పరమేశ్వర్ రెడ్డి నిర్వహించిన ఈ వేలంలో బస్టాండ్ గేటుకు 51 మంది, కూరగాయల దిన మార్కెట్‌కు 29 మంది వేలంలో పాల్గొన్నారు. బస్టాండ్ గేటు హక్కు పర్వతగారి రమణ రూ.17.86 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. కూరగాయల దిన మార్కెట్‌కు బీఎస్ బ్రహ్మయ్య రూ.14.65 లక్షలకు పాట పాడి హక్కును దక్కించుకున్నారు. కాగా గత ఏడాది కూరగాయల దిన మార్కెట్ రూ.24.30 లక్షలకు పలకగా, బస్టాండ్ గేటు రూ.16.97 లక్షలు పలికిగింది. బస్టాండ్ గేటుకు గత ఏడాదితో పోలిస్తే రూ.1.89 లక్షలు ఆదాయం పెరిగింది.

కౌన్సిలర్ భర్తను స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

- పెద్ద ఎత్తున స్టేషన్ వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఇది కక్ష సాధింపు చర్య అంటున్న పార్టీ నాయకులు



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలు మొదలయ్యాయి. క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నాడనే సాకుతో వైఎస్సార్‌సీపీ 40వ వార్డు కౌన్సిలర్ అరుణ భర్త నాగేంద్రను గురువారం వన్‌టౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఎలాంటి ప్రధాన క్రికెట్ మ్యాచ్‌లు లేవు. అయినా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడని సమాచారం వచ్చిందంటూ పోలీసులు నాగేంద్రను తీసుకెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్‌లోనే పెట్టుకున్నారు. కొన్ని రోజుల క్రితం కౌన్సిలర్ అరుణ టీడీపీలో చేరారు. అయితే టీడీపీ విధానాలు నచ్చకనో, నాయకుల తీరు సరిగా లేదనో ఏమో తెలియదు కానీ నాలుగు రోజుల క్రితం అరుణ మళ్లీ వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు అరుణ కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పూనుకున్నారు. ఇందులో భాగంగానే క్రికెట్ బెట్టింగ్ సాకుతో పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

వన్‌టౌన్‌కు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నాగేంద్రను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారని విషయం తెలియడంతో గురువారం సాయంత్రం వైస్ చైర్మన్‌లు బంగారుమునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్‌తో పాటు ముఖ్య కార్యకర్తలు కొందరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోరెడ్డినరసింహారెడ్డి, ఎంపీపీ శేఖర్‌యాదవ్‌లు సీఐ రామకృష్ణారెడ్డితో మాట్లాడారు. నాగేంద్రను స్టేషన్‌కు ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. ప్రస్తుతం క్రికెట్ మ్యాచ్‌లు లేవని, అలాంటప్పుడు బెట్టింగ్ నిర్వహించడానికి ఆస్కారమే లేదన్నారు. కక్షసాధింపు చర్యలో భాగంగానే స్టేషన్‌కు తీసుకొచ్చారని వారు అన్నారు. అతనిపై సస్పెక్ట్ షీట్ ఉండటం వల్లనే స్టేషన్‌కు తీసుకొచ్చామని, ఏదైనా ఉంటే డీఎస్పీతో మాట్లాడాలని సీఐ అన్నారు. తర్వాత స్టేషన్ నుంచి బయటికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఇది ఖచ్చితంగా రెడ్‌బుక్ రాజ్యాంగమేనని చెప్పారు. మొన్నటి వరకు మంచివాడైన నాగేంద్ర టీడీపీ వీడిన మరుక్షణమే చెడ్డవాడయ్యాడా అని అన్నారు. కాగా ఈ విషయమై సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నాగేంద్రపై సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. వరుస క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో స్టేషన్‌కు పిలిపించామన్నారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవన్నారు.

మాదిగ ఉప కులాలకు సమన్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు : మాదిగ ఉపకులాలందరికీ సమన్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో మాదిగ ఉపకులాల రిజర్వేషన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికలో మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 1996లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్ మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని, నాలుగు కేటగిరిలుగా ఏ, బీ, సీ, డీ దామాషా ప్రకారం 2000 నుంచి 2004 వరకు ఎస్సీ వర్గీకరణను అమలు చేశారన్నారు. 2007లో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉషా మెహరా కమిషన్ కూడా మాదిగలకు అన్యాయం జరిగిందని తన నివేదికలో తెలిపిందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిషన్ ఏకసభ్య కమిషన్‌ను నియమించిందన్నారు. ఎస్సీ వర్గీకరణను మూడు కేటగిరిల వారిగా మాలలకు 7.5 శాతం, మాదిగలకు 6.5 శాతం, ఇతరులకు ఒక శాతంగా కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కరుణ మాదిగ, జిల్లా కార్యదర్శి పుల్లయ్య మాదిగ, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి యల్లయ్య మాదిగ, ప్రొద్దుటూరు మండల కన్వీనర్ చాపాటి బాల నరసింహులు మాదిగ, ఉపాధ్యక్షులు గొడుగునూరు బాలయ్య మాదిగ, గౌరవాధ్యక్షులు గొడుగునూరు రామసుబ్బయ్య మాదిగ, ఎర్రగుంట్ల పట్టణ కన్వీనర్ మాతయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మహిళలు పోరాడాలి



మాట్లాడుతున్న రాయలసీమ విద్యార్థి శక్తి కార్యదర్శి హరిత

ప్రొద్దుటూరు : మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా రాయలసీమ మహిళా శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.లక్ష్మీదేవి అధ్యక్షతన విద్యార్థి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి శక్తి కార్యదర్శి హరిత మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానమని, అది కుటుంబం నుంచే మొదలు కావాలని తెలిపారు. అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవం అంటే మహిళలు తమ హక్కులను పోరాడి సాధించుకున్న రోజు అని తెలిపారు. హక్కుల సాధన కోసం మహిళలు కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత మహమూద్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు నాగేంద్ర, శ్రీను, దళిత సమాఖ్య నాయకుడు కొత్తపల్లి యల్లయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా గుండె ఆపరేషన్లు



బ్రోచర్లను విడుదల చేస్తున్న హాస్పిటల్ వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా గుండె ఆపరేషన్లతో పాటు అన్ని రకాల సర్జరీలను ఉచితంగా నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ సీఈఓ శరత్, ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్‌వర్మలు తెలిపారు. గాంధీరోడ్డులోని శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్‌లో హాస్పిటల్ వైద్యులు బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో మొట్ట మొదటి సారిగా ఎన్టీఆర్ వైద్యసేవ కింద గుండె (కార్డియాలజీ), యాక్సిడెంట్ కేసులు, తలకు సంబంధించిన నరాల కేసులను ఓపీలో ఉచితంగా చూడటంతో పాటు అవసరమైన వారికి సర్జరీలను కూడా ఉచితంగా చేస్తామన్నారు. అలాగే కార్డియోథొరాసిక్ సర్జరీ, న్యూరోసర్జరీ, న్యూరాలజీ, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, పాలీట్రామా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, క్రిటికల్ కేర్ సంబంధిత సమస్యలన్నింటికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా తమ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తామని చెప్పారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, ముద్దనూరు తదితర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి ప్రత్యేకమైన కార్డియాక్ హెల్త్ ప్యాకేజీని, డయాబెటిక్ హెల్త్ ప్యాకేజీని ప్రారంభించినట్లు తెలిపారు. రూ. 3700 విలువైన టెస్టులను కేవలం రూ. 499లకు డయాబెటిక్ ప్యాకేజీని అందిస్తామన్నారు. రూ.4000 వేలు విలువైన కార్డియాక్ హెల్త్ ప్యాకేజీని కేవలం రూ.399లతో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ముందుగానే హెల్త్ చెకప్ చేయించుకుంటే ఆరోగ్య సమస్యలను గుర్తించవచ్చని తద్వారా తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా వైద్యులు బ్రోచర్లను విడుదల చేశారు. డాక్టర్లు నాగేశ్వర్, హరీష్‌బాబు, నరసింహారావు పాల్గొన్నారు.

నర్సింగ్‌కు సమాజంలో ప్రత్యేక గుర్తింపు



వేదికపై సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, కళాశాల చైర్మన్, కరస్పాండెంట్

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని సాయిరాజేశ్వరి నర్సింగ్ కళాశాలలో గురువారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు మాట్లాడుతూ నర్సింగ్‌కు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. నర్సింగ్‌ను విద్యార్థులు సేవా భావంతో నేర్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి వైద్య రంగంలో సేవ చేసే వారిని ప్రతి ఒక్కరూ గౌరవిస్తారని తెలిపారు. నర్సింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రామాంజనమ్మ, ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే అనర్థాలు



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ భవానీ

చాపాడు : ఎవరైనా ఒక సారి డ్రగ్స్‌కు అలవాటు పడితే తర్వాత కంట్రోల్ చేయడం చాలా కష్టమని, దీనివల్ల అనారోగ్య, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయని ట్రైనీ డీఎస్పీ భవానీ పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో గురువారం మాదక ద్రవ్యాల వాడకం, ఆరోగ్య సమస్యలు.. ముందు జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ ఒక సారి తీసుకోవడం ద్వారా అది వ్యసనంగా మారి బాడీ కంట్రోల్ తప్పి అనేక శారీరక సమస్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసుల రెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్. శృతి తదితరులు పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు

బద్వేలు అర్బన్ : ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని మెడికల్ షాపుల యజమానులు, ఏజెన్సీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ రవికుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాలరాధాకృష్ణమూర్తి, దర్శిసుబ్బరాజు, గౌరవాధ్యక్షులు కె.వి.సుబ్బారావు, ట్రెజరర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.